ప్రజాశక్తి

మంగళవారం 4 జులై 2023 5 విజయనగరం

ఎసిబికి చిక్కిన సర్వేయర్

ప్రజాశక్తి-రాజాం

ఓ రైతు నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా మండల సర్వేయర్ చంద్రరావు సోమవారం ఎసిబి అధికారులకు చిక్కాడు. మండలంలోని కొండపేట గ్రామంలో ఖాళీ స్థలాన్ని సర్వే చేసేందుకు రైతు సలాది రామదాసు నుంచి సర్వేయర్ రూ.50 వేలు డిమాండ్ చేశాడు. తొలుత రూ.10 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎసిబి అధికారులు మాటు వేసి సర్వేయర్ అంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. చంద్రరావుపై కేసు నమోదు చేశారు.

ఎసిబికి పట్టుబడిన సర్వేయర్ చంద్రరావు

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. గత కొద్దిరోజులుగా ఎండలు దారితెస్తున్నాయి. భూములు బీటలు వారుతున్నాయి. మరోవైపు ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయం దాటిపోతోంది. ఈనేపథ్యంలో పంటల సాగు అదును కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. వరుణుడి కోసం కర్షకుల కళ్లు కడగండ్లు కాస్తున్నాయి.

వర్షాభావం

- అదును కోసం అన్నదాత ఎదురు చూపు
- దారితెస్తున్న ఎండలు
- బీటలు వారుతున్న భూములు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సాధారణంగా ఖరీఫ్ జూన్ రెండో వారం నుంచి ప్రారంభమౌతోంది. సరిగ్గా ఇదే సమయంలో రుతుపవనాలు వచ్చేవి. దీంతో, వరి నారు ముళ్ల సిద్ధం చేసుకోవడంతో ఖరీఫ్ పంటల సాగు మొదలయ్యేది. కానీ, ఈ ఏడాది సమయం గడుస్తున్నా రుతుపవనాలు రాలేదు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 123.5 మిల్లీమీటర్లు కాగా, కురిసింది కేవలం 59.4 మి.మీ మాత్రమే. సీజన్ ప్రారంభమయ్యే నెలలోనే 51.9 మి.మీ వర్షపులోటు ఏర్పడింది. జులైలో 3వ తేదీ వరకు 17 మి.మీ. కురవాల్సివుండగా 15.8మి.మీ. మాత్రమే కురిసింది. సీజన్ ప్రారంభం నుంచి 3వ తేదీ వరకు పరిశీలిస్తే 46.5 మిల్లీమీటర్ల వర్షపు లోటు ఉంది. 3వ తేదీ సాయంత్రం పలుచోట్ల భారీ వర్షాలు కురిసినప్పటికీ లోటు వర్షపాతాన్ని భర్తీచేసే పరిస్థితి లేదు. మరోవైపు ఎండలు మెండుగా కాస్తుండడంతో సోమవారం కురిసే వర్షపునీరు ఆవిరైపోయే పరిస్థితి ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వాస్తవానికి విజయనగరం - పార్వతీపురం మన్యం జిల్లాల్లో పెద్దగా సాగునీటి వనరులు లేవు. దీంతో, వర్షాధారంగానే పంటలు సాగవుతున్నాయి. ఇందులో ఖరీఫ్ పంటలు ప్రధానమైనవి. గత ఖరీఫ్‌లో 2,90,476 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది 3,03,102 ఎకరాల్లో సాగు కావచ్చని అధికారులు భావిస్తున్నారు. ఖరీఫ్ ప్రణాళిక ప్రకారం అత్యధికంగా 2,34,112 ఎకరాల్లో వరిసాగు కానుంది. జిల్లాలో అత్యంత ప్రధాన పంట వరి. మొక్కజొన్న 31,375 ఎకరాలు, నువ్వులు 18,305 ఎకరాలు, చెరకు 11,525 ఎకరాలు, పత్తి 5,105 ఎకరాలు, వేరుశనగ 868 ఎకరాలు, రాగులు 96 ఎకరాలు, మినుములు, పెసలు, కందులు తదితర అపరాలు 329 ఎకరాల్లో సాగవుతాయని అంచనా. కానీ, సాగునీరు లేక ఎదురు చూస్తున్నారు. తోటపల్లి ప్రాజెక్టు కింద సుమారు 2,35,000 ఎకరాల ఆయుకట్టు ఉన్నప్పటికీ స్ట్రక్చర్లు, పిల్లకాలువలు పూర్తికాకపోవడం, ప్రధాన కాలువల మెయింటినెన్స్ కూడా సరిగా లేకపోవడం వంటి కారణాల వల్ల 80వేల ఎకరాలకు మించి సాగునీరు అందించలేని పరిస్థితి. 40ఏళ్ల క్రితం 24వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో తలపెట్టిన జంఝావతి పాలకుల నిర్లక్ష్యం వల్ల 12వేల ఎకరాలకు సాగునీరు అందించే రబ్బరు డ్యాంకు పరిమితమైంది. కాలువల మెయింటినెన్స్ కోసం ఏటా రూ.కోట్ల జైకా నిధులు కొన్నేళ్లుగా విడుదల అవుతున్నప్పటికీ దుర్వినియోగానికి పాల్పడడంతో లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందడంలేదు. ఈ ప్రాజెక్టు కింద ప్రస్తుతం 6వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు లెక్కలు చూపుతున్నప్పటికీ ఆచరణలో అందులో సగం మేరకే నీటి పంపిణీ జరుగుతోంది. ఒడిశాతో నెలకున్న చిన్నపాటి వివాదం పరిష్కరించి సాగునీరు అందించడంలో గతంలో కాంగ్రెస్, ఆ తరువాత టిడిపి, నేడు వైసిపి ప్రభుత్వాలు కూడా విఫలమయ్యాయి. దీని తరువాత అంతటి ప్రతిష్టాత్మకంగా చంపావతి నదిపై తలపెట్టిన తారకరామతీర్థసాగర్ పనులు కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. సుమారు 18ఏళ్ల కావస్తున్నా చుక్కనీరు అందించలేని పరిస్థితి. ఇక పెద్దగెడ్డ, ఆండ్ర, తాటిపూడి, పెదంకలాం, వట్టిగెడ్డ తదితర జలాశయాల పరిధిలో కూడా శివారు ఆయుకట్టుకు నీరు అందించలేని పరిస్థితి. గుర్లగెడ్డ జలాశయాన్ని పాలకులు పూర్తిగా విస్మరించారు. వీటన్నింటినీ ఆధునీకరించడం, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడంతో పాటు వలువైన మినీ జలాశయాల నిర్మాణానికి నిధులు కేటాయించాలంటూ సిపిఎం, ఎపి రైతు సంఘాలు చాలా కాలంలో డిమాండ్ చేస్తున్నప్పటికీ పాలకులకు పట్టడం లేదు. ఇంకోవైపు పోలవరం కాలువ ద్వారా తలపెట్టిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి కూడా అతీగతీ లేదు. ఈనేపథ్యంలో జిల్లాలో మొత్తం వ్యవసాయ కేవలం వరుణుడి కరుణపైనే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది.

భారీ వర్షం.. రైతన్నల హర్షం

ప్రజాశక్తి-విజయనగరం, గుర్ల

జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో రైతులు హర్ష వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సమీపించినా తీవ్ర వర్షాభావం వెంటాడుతున్న నేపథ్యంలో కురిసిన ఈ వర్షంతో రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. వరి నారుమళ్లు సిద్ధం చేసుకునేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. మరోవైపు వారం రోజులుగా తీవ్రమైన ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు వర్షంతో వాతావరణం చల్ల బడడంతో ఊపిరి పీల్చుకున్నారు. విజయనగరంలో సుమారు గంటన్నర పాటు కురిసిన వర్షంతో ప్రాంతాలు జలమయమయ్యాయి. రామకృష్ణ నగర్ సమీపంలో డంపింగ్ యార్డ్ గోడ కూలిపోయి పక్కనే ఉన్న నాలుగు ఇళ్ల ముందు పడిపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. వర్షం నేపథ్యంలో సుమారు గంట పాటు నగరంలో విద్యుత్ కు అంతరాయం కలిగింది.

గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, పట్టణ పేదలు, గిరిజనులు

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిందే

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రభుత్వ భూముల ఆక్రమణదారులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అధికారులను డిమాండ్ చేశారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ భరత్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ అధికార పార్టీ ఎమ్మెల్యే నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల చాలావరకు ఆక్రమణలకు గురయ్యాయని ప్రకటించినా, అధికారులు వాటిని స్వాధీనం చేసుకోకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అల్లుడు శృంగవరపుకోటతోపాటు జిల్లాలో చాలాచోట్ల ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లు అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటని నిలదీశారు. మండలంలోని కాపుసోంపురం, ఆవుల బంద, బుద్ధాయి బంద, గేదలబంద పూర్తిగా ఆక్రమణకు గురై, మాయమైపోయాయని చెప్పారు. పట్టణంలోని రాజుచెరువు, జగ్గు చెరువు, బాబు చెరువు గర్భాలు ఆక్రమణకు గురైనా, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తంచేశారు. పట్టణంలోని బర్మా కాలనీ, శ్రీనివాస కాలనీ మీదుగా ప్రవహిస్తూ రాజు చెరువులో కలిసే పుణ్యగిరి గెడ్డను సుమారు 46 మంది ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. పుణ్యగిరి గెడ్డకు హద్దులు నిర్ధారించి, గెడ్డను కాపాడాలని డిమాండ్ చేశారు.

ఈ నెలాఖరులోగా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని, వాటికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆగస్టు ఒకటి నుంచి తహశీల్దార్ కార్యాలయం వద్ద శిబిరం ఏర్పాటు చేసి నిరవధిక పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సిపిఎం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. సుమారు 3 వేల మంది వరకు అర్హులుగా గుర్తిస్తే అధికారులు మారిపోవడంతో అర్హుల జాబితాను మారుస్తూ నేడు సర్వే నంబర్ 147లో జగనన్న కాలనీలో అనర్హులకు ఇళ్ల స్థలాలు కట్టబెట్టారని మండిపడ్డారు. దీనిపై త్వరలో ఉద్యమానికి కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్ల జగన్, సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, నాయకులు శంకర్, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టిడిపి చైతన్యయాత్ర

ఐదు రోజులు.. ఐదు నియోజకవర్గాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో మంగళవారం నుంచి టిడిపి భవిష్యత్ గ్యారెంటీ చైతన్య రథయాత్రను ప్రారంభిస్తున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, మాజీమంత్రి కోండ్రు మురళి తెలిపారు. సోమవారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ నాలుగేళ్లలో రాష్ట్రానికి భవిష్యత్ గ్యారెంటీ అనేది లేకుండా పోయిందని అన్నారు. ప్రజల భవిష్యత్తు కు గ్యారెంటీ ఉండాలంటే ఒక్క చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తామని తెలిపారు. ప్రధానంగా తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ.1500, దీపం పేరుతో ప్రతి ఇంటికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించబోతున్నట్లు తెలిపారు. 20 లక్షల మంది నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు చొప్పున అందిస్తామన్నారు. ప్రతి ఇంటికి రక్షిత తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇస్తామని, బిసిల రక్షణకు చట్టం చేస్తామని తెలిపారు. ఐదేళ్లలో కనీసం రెట్టింపు ఆదాయం చేయడం వంటి గ్యారెంటీ కార్యక్రమాలను చంద్రబాబు ప్రజల ముందుకు తీసుకువస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే ఈ చైతన్య రథయాత్ర రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలోను, ప్రతి గ్రామాల్లోనూ ప్రతి ఒక్కరిని కలుసుకుని వెళ్తుందని తెలిపారు. ఈనెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఐదు నియోజకవర్గాల్లో ఐదు రోజులు పాటు చైతన్య రథయాత్ర సాగుతుందన్నారు. తొలిరోజు విజయనగరం నియోజకవర్గం, 5న నెల్లిమర్ల, 6న చీపురుపల్లి, 7న రాజాం, 8న బొబ్బిలిలో ఈ యాత్ర సాగుతుందని తెలిపారు. అశోక్ బంగ్లాలో ఉదయం తొమ్మిది గంటలకు చైతన్య రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం ఇల్లు కొండవెలగాడ దగ్గర టిడ్కో ఇళ్ల పరిశీలన, ఘోషాసుపత్రి వద్ద వినతులు స్వీకరణ, కొత్తపేటరోడ్డు పరిశీలన ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం సారిక దగ్గర ఉన్న డ్రిప్ ఇరిగేషన్ పరిశీలన, దుప్పాడ సభ, పల్లెనిద్ర ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, బొబ్బిలి నియోజకవర్గ ఇన్చార్జి బేబీ నాయన, పట్టణ కార్యదర్శి బంగారుబాబు, గంటా పోలినాయుడు, కనకాల మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార చర్యలు వివరించండి

జగనన్నకు చెబుదాంపై కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులకు ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా పరిష్కారానికి చేపట్టిన చర్యలపై ఆయా శాఖల అధికారులు, సిబ్బంది స్వయంగా అర్జీదారులను కలసి వివరించడం ద్వారా సంతృప్తి పరచవచ్చని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. దీనివల్ల సంబంధిత సమస్యను వెంటనే పరిష్కరించలేనప్పటికీ కొంతకాల వ్యవధిలో ఆ సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకం అర్జీదారులలో కలిగించాలని అన్నారు. జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల పరిష్కారం కార్యక్రమంలో భాగంగా గత వారంలో అర్జీదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమైన వినతులపై కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో అధికారులతో సమీక్షించారు. జగనన్నకు చెబుదాంలో వచ్చే వినతులపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయకుండా, తగిన చర్యలు పూర్తికాకుండా మూసివేయవద్దని స్పష్టం చేశారు. గ్రానైట్ లీజులను అక్రమంగా కేటాయించారంటూ వచ్చిన ఒక వినతిపై గనులు, రెవిన్యూ, జలవనరులు, సర్వే విభాగం అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టి నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, విద్యుత్, సాంఘిక సంక్షేమ, గృహ నిర్మాణం, గనులు, ఎపివివిపి, పంచాయతీరాజ్, పోలీసు, రిజిస్ట్రేషన్లు, డ్వామా, మహిళాశిశు సంక్షేమశాఖలకు సంబంధించి అసంతృప్తి వ్యక్తమైన వినతులపై ఆయా శాఖల అధికారుల వివరణ అడిగారు.

సమస్యలు వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి

జగనన్నకు చెబుదాంకు 217 వినతులు

కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజల నుంచి 217 వినతులు అందాయి. ఎప్పటిలాగే రెవిన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై అత్యధికంగా 142 వినతులు అందాయి. వినతులు స్వీకరణలో డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఎస్‌డిసిలు సూర్యనారాయణ, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన మోడల్ స్కూల్ భోగాపురం విద్యార్థులు జి.తరుణ్, కె.తరుణ్‌లను కలెక్టర్ అభినందించారు. వీరు విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని డిఇఒ లింగేశ్వర రెడ్డి వివరించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి కూడా పాల్గొన్నారు.

జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులను ముందుగా గుర్తించాలి

జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధులను ముందుగానే గుర్తించి అప్రమత్తం కావడం ద్వారా ఈ వ్యాధి త్వరగా వ్యాప్తి చెందకుండా నిరోధించవచ్చని కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి పేర్కొన్నారు. జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధుల నిరోధంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. శునకాలు, పశువుల ద్వారానే వ్యాధులు మనుషులకు సోకే అవకాశం వుంటుందని, ఆ వ్యాధులు సోకినపుడు వుండే లక్షణాలు తదితర అంశాలపై అవగాహన కలిగించాలన్నారు.

పెంపుడు జంతువులకు వ్యాధినిరోధక టీకాలు వేయించడం ద్వారా జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సోకకుండా నిరోధించవచ్చని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ఎస్.అప్పల నాయుడు వివరించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటు మందు అందుబాటులో వుంటుందని ప్రజలు కుక్క కాటుకు గురైన వెంటనే ఆసుపత్రికి వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.భాస్కరరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ నిధి సేకరిస్తున్న సిపిఎం నాయకులు రమణ

పోలవరం సంఘీభావ నిధి వసూలు

విజయనగరం టౌన్ : రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన పోలవరం ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు సర్వం ధారపోసిన నిర్వాసితుల పోరాటానికి సిపిఎం ఆధ్వర్యాన నిధి వసూలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి.రమణ మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యాన 400 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారని తెలిపారు. వీరి పోరాటానికి సంఘీభావంగా నిధి వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా సహకరించాలని కోరారు. ఇప్పటికే అన్ని రంగాల కార్మికులు విరాళాలు ఇచ్చారని తెలిపారు.

స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

విజయనగరం : స్పందన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్‌పి ఎం.దీపిక పోలీసు అధికారులను ఆదేశించాఇరు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంయి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌సి,ఎస్‌టి సెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళీ, సిఐలు జి. రాంబాబు, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

2 నెలల్లో అంబటిసత్రం - కొత్తపేట రహదారి పనులు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దొంగే.. దొంగ, దొంగ అని అరిచిన చందాన టిడిపి నాయకుల తీరు ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలిపారు. టిడిపి హయాంలో చేయలేక, చేతులెత్తేసిన పనులను సైతం.. అభ్యంతరాలను పరిష్కరిస్తూ, అడ్డంకులను అధిగమిస్తూ తాము పూర్తి చేసుకుని వస్తున్నామని వెల్లడించారు. పలు కారణాలతో కొన్నేళ్లుగా అసంపూర్తిగా మిగిలిపోయిన అంబటి సత్రం కూడలి - కొత్తపేట నీళ్ల ట్యాంక్ వరకు రహదారిని ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మారుమూల ప్రాంతాలకు సైతం రహదారులు వేయిస్తున్నామని చెప్పారు. కంటోన్మెంట్ - బాలాజీ కాంప్లెక్స్ మీదుగా కలెక్టరేట్ వరకు, మయూరి కూడలి - బాలాజీ , ఆర్అండ్ బీ కూడలి - పాల్ నగర్, బాలాజీ - గంటస్తంభం తదితరచోట్ల కొన్నిచోట్ల పనులు పూర్తి కాగా, మరికొన్ని త్వరలోనే అవుతాయన్నారు. ప్రధానంగా అంబటి సత్రం - కొత్తపేట నీళ్ల ట్యాంక్ వరకు రహదారి పెండింగ్ లో ఉందని, ప్రస్తుతం ఆ దస్త్రం ఆర్థిక శాఖ వద్ద సిద్ధమైందని వివరించారు. రాబోయే రెండు నెలల్లో టెండరు ప్రక్రియ పూర్తి చేసి, పనులకు వెళ్తామన్నారు. సమస్యలున్న చోట, న్యాయస్థానాల్లో కేసులు ఉన్న వాటిని పరిష్కరిస్తూ, స్థానికులను ఒప్పిస్తూ పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయయాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, జోనల్ ఇన్‌ఛార్జులు ముచ్చు శ్రీను యాదవ్, ముద్దాడ మధు, అల్లు చాణక్య, గుజ్జల నారాయణరావు పాల్గొన్నారు.

రహదారిని పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

గడప గడపకు కార్యక్రమంలో...

నగరంలోని 48వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా చిన్నచిన్న కాలువలు, రహదారుల మరమ్మతులను చేపట్టాలని అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, స్థానిక కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ, తవిటి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏం జరిగిందో ఏమో!

తల్లి ఆత్మహత్య.. కుమార్తె ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలో సోమవరం చోటుచేసుకున్న ఘటనలు కలకలం రేపాయి. ఏం జరిగిందో కానీ, తల్లి ఆత్మహత్య చేసుకోగా, కుమార్తె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం.. గాంధీ నగర్ కాలనీకి చెందిన తల్లీ కూతుళ్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇందులో తల్లి బొట్టా సత్యవతి (42) రైలు కింద పడి మృతి చెందింది. కూతురు బొట్టా సాయిలీల ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా స్థానికులు చూసి చికిత్స నిమిత్తం మిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా సాయిలీల హైదరాబాదులో ఉద్యోగం చేసుకుంటూ ఇటీవలే తలిదండ్రుల వద్దకు వచ్చింది. తల్లీ కూతుళ్ళ ఇద్దరి మధ్య ఏం జరిగిందో గాని ముందు తల్లి నెల్లిమర్ల మూలస్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడింది. తరువాత ఆమె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయిలీల

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిఒ 60 ప్రకారం జీతాలు చెల్లించాలని, తమను రెగ్యులర్ చేయాలని, పెండింగ్ సమస్యల పరిష్కరించాలని కోరుతూ నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కార్యమంలో జెఎసి రాష్ట్ర కోశాధికారి జె.సింహాచలం, జిల్లా జెఎసి కన్వీనర్ జి.ధనలక్ష్మి, జెఎసి నాయకులు సత్యనారాయణ, ప్రభుత్వ కాంట్రాక్ట్ 2 ఎఎన్ఎంల సంఘం నాయకులు ఎల్ భూదేవి, గవర్నమెంట్ హాస్పిటల్ కంటెంజెంట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.దుర్గారావు , జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఎస్. సంతోష్ , జిల్లా ఉపాధ్యక్షులు డి. లక్ష్మి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ రమణ బేబి తదితరులు పాల్గొన్నారు.

15లోగా విద్యార్థుల నమోదు

ప్రజాశక్తి-విజయనగరం

మిషన్ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో కింద ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల నమోదు వంద శాతం జరగాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఇప్పటి వరకు 43 శాతం పూర్తయిందని, మిగిలిన వారిని 15లోగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఎంఇఒలు, మండల ప్రత్యేకాధికారులతో సోమవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జగనన్న సురక్ష, మిషన్ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, గడపగడపకు, జగనన్నను చెపుదాం వినతుల అసంతృప్తి, సంక్రమిత వ్యాధులు, ప్రయారిటీ భవన నిర్మాణాలపై మండల వారీగా సమీక్షించారు. 6 నుంచి ఏడో తరగతికి, 10 నుంచి ఇంటర్‌లో చేరే విద్యార్థులను తప్పనిసరిగా సర్వే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులన్నీ ఆన్‌లైన్‌లో అప్లోడ్ కావాలన్నారు. ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న ప్రయారిటీ భవనాల నిర్మాణాల దశలు వేగంగా మారాలని ఆదేశించారు. 15 రోజుల క్రితం నుండి నేటి వరకు జరిగిన పురోగతిపై ఆరాతీశారు. పురోగతి కనపడని వారికి ఛార్జ్ మెమోలు ఇస్తామన్నారు.ఫీవర్ సర్వే కచ్చితంగా జరగాలన్నారు. పిహెచ్‌సిల్లో అత్యవసర మందులన్నీ అందుబాటులో ఉంచాలని తెలిపారు. జగనన్నకు చెపుదాం వినతుల సంతృప్తి శాతం పెరగాలన్నారు. వినతులపై తీసుకుంటున్న చర్యలను అర్జీదారులకు వివరించాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతిరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యానికి కృషి : ఎంహెచ్ఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల సహకారంతో నగరంలో సంపూర్ణ పారిశుధ్యానికి కృషి చేస్తామని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి అన్నారు. సోమవారం ప్రజారోగ్య అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సహకారంతో, సిబ్బంది సమన్వయంతో నగరంలో మెరుగైన పారిశుధ్యానికి కృషి చేస్తానని అన్నారు. కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. వర్షాకాలంలో దోమల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. చెరువులలో, కుంటలలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్, మందుల పిచ్చికారి వంటివి యుద్ధ ప్రాతిపదికన చేపడతామన్నారు. మెరకముడిదాం పిహెచ్‌సి నుంచి బదిలీపై నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారిగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, సాల్మన్ రాజు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ వెంకట్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు

'జగనన్న సురక్ష'తో సేవలు సులభం

ప్రజాశక్తి-రేగిడి

జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు ఎంతో మేలని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఈ మేరకు ఖండ్యాంలో సచివాలయం వద్ద జగనన్న సురక్షలో భాగంగా అర్హులకు 11 రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల రోజులపాటు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు రాజకీయాలకతీతంగా అర్హులైన వారందరికీ అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు కింజరాపు సురేష్ కుమార్, జి.భాస్కర్‌రావు, తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి గోవిందరావు ఉన్నారు.

వేపాడ : జగనన్న సురక్ష కార్యక్రమంతో సేవలు సులభతరం అయ్యాయని ఎంపిపి డి.సత్యవంతుడు తెలిపారు. మండలంలోని కొంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సురక్ష కార్యక్రమం సేవలు ప్రతి కుటుంబానికీ చేరువ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్.అరుణ, జెసిఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు, కె ఆర్ పేట సర్పంచ్ బాలబాబు, పైడిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ ఎంఇఒగా కెవి రమణ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని ఎంఇఒ-1 గా కె.వి రమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఐదారేళ్లగా ఇంఛార్జి ఎంఇఒలు బాధ్యతలు నిర్వహించేవారు. ఇప్పుడు పర్మినెంట్ ఎంఇఒ వచ్చారు. ఇప్పుడు మండలంలో ఇద్దరు ఎంఇఒలు ఉండటంతో విద్యాశాఖ అభివృద్ధిలో మండలం ముందుండాలని పలువురు కోరుతున్నారు.

భవిత కేంద్రం పరిశీలన

బాధ్యతలు చేపట్టిన తరువాత ఎంఇఒ రమణ మండలంలోని భవిత కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి సోమవారం ఇక్కడ వికలాంగు పిల్లలకు నిర్వహించే ఫిజియోథెరపీని పరిశీలించారు. వికలాంగు పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. ఫిజియోథెరపిస్ట్ హేమలత, ఐఇఆర్‌పిలు కె అప్పలరాజు, రవీందర్ రావు పాల్గొన్నారు.

పూసపాటిరేగ ఎంఇఒగా రాజకుమార్

ప్రజాశక్తి- పూసపాటిరేగ

మండలానికి నూతన ఎంఇఒ-1గా అల్లక రాజకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. విద్యావ్యవస్థను మరింత పటిష్టపరిచేందుకు ప్రభుత్వం మండలానికి ఇద్దరు చొప్పున విద్యశాఖాధికారులను నియమించిన సంగతి తెలిసిందే. ఇటీవల రెండవ ఎంఇఒగా బి. పాపినాయుడు విధుల్లో చేరగా తాజాగా జరిగిన నియామక ప్రక్రియలో రాజకుమార్ మొదటి ఎంఇఒగా పథోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా రెండవ ఎంఇఒ పాపినాయుడు, ఉపాధ్యాయ సంఘాలు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది రాజకుమర్‌కు పుష్పగుచ్చంలతో ఆహ్వానించి అభినందనలు తెలియజేశారు.

అంగన్వాడీలకు కనీస వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

అంగన్వాడీలకు కనీస వేతనాలివ్వాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు ఇవ్వాలన్నారు. వేతనంలో సగం పింఛను ఇవ్వాలని, అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10 ,11 వ తేదీల్లో జరిగే 36 గంటల ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సిఐటియు నాయకులు బలస శ్రీను, సెక్టార్ లీడర్ రాధమ్మ, హెల్పర్ రాధ, సింహాచలమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

వైసిపి పాలనపై ప్రజల్లో అసంతృప్తి

ప్రజాశక్తి-బొండపల్లి

వైసిపి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని కిండాం అగ్రహారం, మరువాడ కొత్తవలస, వెదురవాడ, మరువాడ పంచాయతీల్లో ఆయన పర్యటించారు. ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేతనదారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి శ్రీనివాసరావు, కొవ్వాడ బాలరాజు, బూర మహేష్, శివకుమార్, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

జీవరాశుల కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలే ఎక్కువ

ప్రజాశక్తి-శృంగవరపు కోట

సముద్ర జలాల్లో జీవరాశుల కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలే ఎక్కువగా పేరుకుపోయాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు తెలిపారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత అవగాహన దినోత్సవాన్ని ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ వాడకం పెరిగిందన్నారు. దీన్ని నిర్మూలించకుంటే మానవాళికి పెనుప్రమాదం వాటిల్లుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.రమేష్ కుమార్, అధ్యాపకులు సిహెచ్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పిఒలు బి.సంధ్యారాణి, వలీఖాన్, లైబ్రేరియన్ స్వామినాయుడు, పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆతవ గ్రామ సచివాలయాన్ని సోమవారం ఎంపిడిఒ బిఎస్‌కెన్ పట్నాయక్ ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయ రికార్డులను పరిశీలించారు. గృహ నిర్మాణాల తీరు, సచివాలయ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. సచివాలయ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి నానిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవల పరిశీలన

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని జిన్నాంలో సోమవారం మరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి సుష్మ అందిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను డిప్యూటీ డిఎంహెచ్ఒ సూర్యనారాయణ పరిశీలించారు. 78 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. రోగి స్థాయిని బట్టి ప్రాంతీయ, జిల్లా కేంద్రాస్పత్రికి పంపిస్తున్నట్లు చెప్పారు. అందుతున్న వైద్య సేవల పట్ల డిడిఎంహెచ్ఒ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికీ వైద్య సేవలను చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో 104 డిఎం వినోద్, ఎంఎల్‌హెచ్‌పి సంధ్య, ఆశా వర్కర్లు సంతోషి, గౌరీ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి యోగా మంచిది

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆరోగ్యానికి యోగా ఎంతో మంచిదని యోగా గురువు ఆరి సుందర శివరావు తెలిపారు. నగరంలోని కంటోన్మెంట్‌లో రెడ్‌క్రాస్ యోగా శిక్షణ కేంద్రంలో గురుపూజోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. యోగా కేంద్రం గురువు సుందర శివరావును యోగా అభ్యాసకులు ఘనంగా సత్కరించారు. యోగా కేంద్రం, రక్తనిధి కేంద్రం నిర్వహణతోపాటు వివిధ సామాజిక సేవా, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న రెడ్‌క్రాస్ సంస్థకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి కెఆర్‌డి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అభ్యాసకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మ్యూజిక్ అకాడమీ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రోటరీ దళిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ నూతన బ్రాంచిని పద్మావతి నగర్‌లో ప్రారంభించారు. రోటరీ క్లబ్ నూతన అధ్యక్షులు డాక్టర్ కష్ణశాంతి చేతుల మీదుగా ప్రారంభించారు. రోటరీ క్లబ్ మెంబర్లు డాక్టర్ డివి శ్రీకాంత్, దుర్గా బాలాజీ, గుండా చిన వీరభద్రరావు, కాపుగంటి రవి, డాక్టర్ పద్మకుమారి,డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ రాధికారాణి, మంజుల, సీతారాం, కార్యదర్శి సూర్యలక్ష్మి, అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి మాట్లాడుతూ తదితరులు పాల్గొన్నారు. పద్మావతి నగర్, వసంత విహార, గాయత్రీ నగర్ తదితర ప్రాంత వాసులకు సంగీతం నేర్చుకునేందుకు ఈ శాఖ ఉపయోగపడుతుందని అన్నారు.

ప్రథమ ప్రాధాన్యత విద్యకే

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-మెంటాడ

విద్యకే ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర తెలిపారు. మెంటాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జగనన్న అమ్మఒడి, విద్యా కానుక నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 17,848 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరినట్లు తెలిపారు. మొదటి విడతలో రూ.8.5 కోట్లతో 30 పాఠశాలల్లో మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా సకల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. రెండో విడతలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, ఎంఇఒ ఎం.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ రామకృష్ణ, ఎంపిడిఒ త్రివిక్రమరావు, వైస్ ఎంపిపిలు సారికి ఈశ్వరరావు, తెట్టంగి దుర్గ, సర్పంచ్ రేగిడి రాంబాబు, ఎంపిటిసి పతివాడ కుమారి, తదితరులు పాల్గొన్నారు

బాడంగి : బాడంగి హైస్కూల్లో ఎంఇఒ రాజేశ్వరి అధ్యక్షతన మండల స్థాయి అమ్మఒడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మఒడి చెక్కును విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, ఎంపిపి భోగి గౌరి, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి శంకరరావు, హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : జగనన్న అమ్మఒడి పథకం విద్యార్థుల పాలిట కల్పతరువని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస హైస్కూల్లో ఎంఇఒ శ్రీదేవి అధ్యక్షతన అమ్మఒడి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 2022-23 సంవత్సరానికి గాను 5893 మంది విద్యార్థులకు అమ్మఒడి కింద రూ.8.83 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, బొంతల వెంకట్రావు, పిఎస్ఎన్ పాత్రుడు, ఎంఇఒ బండారు శ్రీనివాసరావు, హెచ్‌ఎం సిహెచ్.ఈశ్వరరావు, పళ్ల భీష్మ, స్కూల్ కమిటీ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

మెంటాడ.. అమ్మఒడి చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

వార్డెన్‌పై విద్యార్థినుల ఫిర్యాదు

బిసి గర్ల్స్ హాస్టల్ వార్డెన్ దుర్భాషలాడుతూ, దురుసుగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థినులు ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు ఫిర్యాదుచేశారు. అమ్మఒడి కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ వార్డెన్‌తో మాట్లాడాలని సంబంధిత అధికారులతోపాటు ఎంపిపి గోపమ్మకు సూచించారు. వార్డెన్‌పై చర్యలు తీసుకుంటామని, హాస్టల్లో సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఈ విషయమై వార్డెన్ నీరజ్‌కుమారిని వివరణ కోరగా, ఆడపిల్లలు కావడంతో హాస్టల్ కదలకుండా చేయడం, క్రమశిక్షణలో ఉంచడం చేస్తున్నట్లు తెలిపారు.

వేపాడ : వేపాడ హైస్కూల్లో ఏర్పాటుచేసిన అమ్మఒడి ఉత్సవాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు విద్యార్థులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యావంతులు కావాలనే ఉద్దేశంతో సిఎం జగన్ పనిచేస్తున్నారని తెలిపార. కార్యక్రమములో ఎంపిపి డి.సత్యవంతుడు, డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామినాయుడు, జెడ్‌పిటిసి ఎస్.అప్పలనాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.కస్తూరి, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ బి.శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగన్నాథం, ఎం.సత్యనారాయణ, సిహెచ్ పద్మావతి. ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఎంఇఒ బాలభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

వేపాడ.. అమ్మఒడి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

రోడ్డు సమస్యను పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోదవలస పంచాయతీ ఒళ్లూరు గ్రామానికి రోడ్డు సమస్య పరిష్కరించాలని కోరుతూ జనసేన నాయకులు సోమవారం ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న రోడ్డు సమస్యను పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆందోళనకు దిగారు. అనంతరం ఎంపిడిఒ, తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు బూర్లె విజయ్‌శంకర్ మాట్లాడుతూ ఆ గ్రామానికి మంచినీటి సమస్య కూడా ఉందన్నారు. మోదవలస పంచాయతీ మొత్తానికి శ్మశాన వాటిక అభివృద్ధి జరగలేదన్నారు. మార్కెట్ యార్డు శంకుస్థాపన జరిగి పనులను ఆపేశారని వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోదవలస జనసేన నాయుకులు పైల సురేష్ కుమార్, ఎర్నింటి రమేష్, దిండి రామారావు, పిన్నింటి రాజారావు, తోత్తడి సూర్య ప్రకాష్, లింగం రమేష్, పైల శ్రీను, రఘు పిన్నింటి గౌరీ శంకర్, రాజారెడ్డి, పొంతపల్లి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మద్యం షాపులని నామకరణం చెయ్యాలి

రాష్ట్రంలో ప్రభుత్వం నడుపుతున్న మద్యం షాపులకు జగనన్న మద్యం షాపులని నామకరణం చేయాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉండగా ఆయన పాదయాత్ర చేసిన సమయంలో అధికారంలోకి రాగానే దఫలవారీగా మద్య నిషేదం అని చెప్పి ఇప్పుడు మాట తప్పడమే కాకుండా ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపే పరిస్థితికి వచ్చిందన్నారు. అనంతరం డెంకాడ గ్రామంలో ఉన్న మద్యం షాప్ ముందు జనసేన ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

విత్తన, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

రూ.4.40 లక్షల విత్తన అమ్మకాలను నిలిపివేత!

ప్రజాశక్తి- డెంకాడ

విత్తన వ్యాపారస్తులు విత్తనాల స్టాక్ బోర్డులను, స్టాక్ రిజిస్టర్ లను, విత్తనాల మొలక శాతాన్ని సరిచూసుకోవాలని, అంతర్ డివిజన్ పర్యవేక్షణ అధికారి, చీపురుపల్లి ఎడిఎ విజయలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని సోమవారం మండల వ్యవసాయ అధికారి పి. నిర్మల ఆధ్వర్యంలో డెంకాడ ఎఎస్ఐ దామోదర్ రావు, చీపురుపల్లి ఎడిఎ విజయలక్ష్మి కలిసి సాయి కృష్ణ రైతు మిత్ర గ్రూప్, గంగమాంబ ఫెర్టిలైజర్స్ ఎరువులు, విత్తనముల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డెంకాడ గంగమాంబ ఫెర్టిలైజర్స్ దుకాణంలో సుమారు రూ.4.40 లక్షల విలువగల విత్తన అమ్మకాలను నిలిపివేసినట్లు తెలిపారు. విత్తన వ్యాపారస్తులు విత్తనాలు తెచ్చిన వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారికి తెలియ జేయాలన్నారు. విత్తనాలు అమ్మకాలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మొలక శాతంను గుర్తించిన తరువాత అమ్మాలని సూచించారు.

తనిఖీలు చేస్తున్న ఎడి విజయలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

రాష్ట్రంలో నియంత పాలన

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ

రాష్ట్రంలో ప్రస్తుతం నియంత పాలన సాగుతోందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆందోళన వ్యక్తంచేశారు. మండలంలోని చామలాపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లను అమ్ముకొని మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేస్తే మన ఆస్తులు కూడా మనకు ఉండవన్నారు. కుటుంబాలన్నీ నాశనం అవుతాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వానికి బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మళ్లీ చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని, అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు సిహెచ్.జగన్, బాలకృష్ణ, గుమ్మడి భారతి, సేనాపతి గణేష్, మంచిన అప్పలసూరి, తాడి కృష్ణ, సిరికి రమణ, చొప్ప దేవుడు, గుమ్మడి రాంబాబు పాల్గొన్నారు.

సిటియులో గురుపూజోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో సోమవారం గురు వందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుంట లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. భారతదేశానికి చాలా ప్రాచీనమైన నాగరికత ఉందని, ఇక్కడ మనం ఆచరించే ప్రతి ఆచారంలోనూ సైన్స్ ఉంటుందని తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ టివి కట్టిమణి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉదాత్తమైనదని, ఈ వృత్తికి గౌరవం తీసుకురావడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

నారాయణ పబ్లిక్ స్కూలులో..

విజయనగరంకోట : గురువులను పూజించడం ఎన్నో జన్మల పుణ్యఫలమని తెలుగు భాషా సేవాసంఘం అధ్యక్షులు ఆర్‌బి రామానాయుడు కొనియాడారు. గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక గాజులరేగ నారాయణ పబ్లిక్‌స్కూల్‌లో శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు గు అంటే చీకటి అని, రు అంటే తొలగించడం అని అర్థం అన్నారు.

నేడు గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఇఒ కార్యాలయంలో మంగళవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీకి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు డిఇఒ లింగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 28 జిల్లా పరిషత్తు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పోస్టులను ఉద్యోగోన్నతిపై భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సీనియారిటీ జాబితా కూడా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు. కౌన్సిలింగ్‌కు వచ్చే ఉపాధ్యాయులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ : డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్‌పై ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయులు 10637 మందికి రెండు రోజుల శిక్షణా కార్యక్రమం బ్యాచ్‌ల వారీ ఏడు ఇంజినీరింగ్ కళాశాలల్లో జరుగుతుందని డిఇఒ లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఈనెల 1 నుంచి 16వ తేదీ వరకు శిక్షణ ఉంటుంన్నారు. ఒక్కొక్క బ్యాచ్ లో గరిష్ఠంగా 40 మంది ఉంటారని తెలిపారు. ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్ ఉపయోగించే విధానం, బై జ్యూస్ కంటెంట్ ఉపయోగించి, ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్‌పై భోదన చేసే విధానంపె శిక్షణ ఉంటుందని తెలిపారు.

రేషన్ బియ్యం వేలం

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరం ఎంఎల్‌ఎస్ కేంద్రం వద్ద సోమవారం 233.50 క్వింటాళ్ల రేషన్ బియ్యానికి జిల్లా ఎఎస్ఒ అశోక్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వేలంలో రూ 28.50 చొప్పున మెరకముడిదాం మండలానికి చెందిన బూర్లె సురేష్ స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో గజపతినగరం, దత్తిరాజేరు సిఎస్ డిటిలు రవిశంకర్, ధనం పాల్గొన్నారు.

150 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- భోగాపురంరూరల్

జాతీయ రహదారిపై కారులో తరలిస్తున్న రూ.10 లక్షలు విలువైన సుమారు 150 కేజీల గంజాయిని సోమవారం సాయంత్రం భోగాపురం సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. నిందితులు మాత్రం కారును వదిలేసి పరారయ్యారు. వివరాల్లోకి వెళితే .. శ్రీకాకుళం జిల్లాలో ఓ బాలిక కిడ్నాప్‌కు గురైందని సమాచారం రావడంతో భోగాపురం ఎఎస్ఐ రాజు ఆధ్వర్యంలో టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఇంతలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఇన్నోవా కారు అక్కడికి రాగా, తనిఖీల్లో భాగంగా వెనుక డిక్కీని ఓపెన్ చేయాలని పోలీసులు చెప్పారు. దీంతో డ్రైవర్ కారును స్టార్ట్ చేసుకుని స్పీడుగా వెళ్ళిపోయాడు. అనుమానం వచ్చిన పోలీసులు వెంబడించగా భోగాపురం సమీపంలో నిందితులు కారును వదిలేసి వెళ్లిపోయారు. అందులో తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఎస్ఐ కృష్ణమూర్తి చేరుకొని కారుని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

గంజాయి తరలించిన కారు

నేరాలు ఘోరాలు

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జామి

జామి బిసి కాలనీకి చెందిన వాక స్వామినాయుడు(35) బైకు అదుపు తప్పి బోల్తా పడి మృతి చెందాడు. స్వామినాయుడు క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి బైకు నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. స్వామినాయుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. దీంతో కుటుంబం రోడ్డున పడుతుందని బంధువులు రోధిస్తున్నారు.

బొలెరో ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - జామి

మండలంలోని అలమండ సంత సమీపంలో బొలెరో వాహనం ఢీకొని బైక్‌పై వెళుతున్న ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. ఈ ఘటనలో లక్కవరపుకోట మండలం కొట్యాడ గ్రామానికి చెందిన కె.బంగారయ్య, ఆయన కుమారుడు ఈశ్వరరావు గాయాల పాలయ్యారు. వీరిని 108 వాహనంలో కొత్తవలస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిద్దరు అలమండ సంతనుంచి కన్నెతాడు కొనుక్కొని వస్తుండగా గొడుకొమ్ము మలుపు వద్ద వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొంది. అనంతరం బొలెరో కూడా బోల్తా పడింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

బోల్తాపడిన బొలెరో వాహనం

అల్లూరిని స్పూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

విద్యార్థులంతా అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ అన్నారు. స్థానిక జూనియర్ కాలేజీలో అల్లూరి సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీహరి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ అల్లూరి స్ఫూర్తితో విద్యారంగంపై వచ్చే సమస్యలపై పోరాటం చేస్తూనే ఉందన్నారు. అనంతరం 14 మందితో నూతన మండల కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్ష కార్యదర్శులుగా రఘు, పైడిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని మెకానిక్‌ల ర్యాలీ

ప్రజాశక్తి-బొబ్బిలి

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ద్విచక్ర వాహన మెకానిక్‌ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వంగపండు మహేష్, మురళి డిమాండ్ చేశారు. మెకానిక్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో సోమవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దార్ రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. బీమా సౌకర్యం కల్పించాలని, టెక్నాలజీకు అనుగుణంగా ప్రభుత్వమే మెకానిక్ శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు కె.వాసు, కె. చంద్ర, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు, హమాలీలు

హమాలీ ఛార్జీలు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పని చేసిన హమాలీలకు ఛార్జీలు ఇవ్వాలని సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో హమాలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం మాట్లాడుతూ తెర్లాం మండల కేంద్రంలో రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసిన కూలీలకు హమాలీ ఛార్జీలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. హమాలీ ఛార్జీలను ప్రభుత్వం విడుదల చేసినా, అధికారులు జాప్యం చేయడమేమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2020-21, 2021-22 సీజన్లలో హమాలీ ఛార్జీలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సుదర్శనదొరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హమాలీ మేస్త్రీ సిహెచ్ రామారావు పాల్గొన్నారు.

హాస్టల్‌కు మరమ్మతులు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గంట్యాడలోని బిసి హాస్టల్ భవనానికి మరమ్మతులు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం స్పందనలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా గంట్యాడ ఎస్ఎఫ్ఐ మండల కన్వీనర్ సోమేష్ మాట్లాడుతూ గంట్యాడలోని బిసి చిన్న పిల్లల హాస్టల్ ఇప్పటికే శిథిలావస్థకు చేరిందని, ఈ విషయం గత మూడేళ్లగా అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదన్నారు. భవనం కూలిపోకముందే హాస్టల్ భవనం మరమ్మతు చేయడమా లేదా సొంత భవనం మరోచోట నిర్మించడం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవికుమార్ ఉన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని రక్షించండి

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని తోటపాలెం శ్మశానవాటిక స్థలం ఆక్రమణలకు గురవుతున్నందున అధికారులు స్పందించి స్థలాన్ని రక్షించాలని ఆ వార్డుకు చెందిన పలువురు దళితులు సోమవారం స్పందనలో అధికారులకు వినతి అందజేశారు. శ్మశానస్థలం 3.50సెంట్లలో స్వర్గదామం, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌లకు మినహాయించగా మిగిలి ఉన్న సుమారు 45 సెంట్ల స్థలంలో బిసిల, ఎస్‌సిలు ఎవరైనా చనిపోతే ఖననం చేసేందుకు ఉపయోగిస్తున్నారని ఆ కాలనీకి చెందిన దళిత సంఘం నాయకుడు గొండేల ప్రకాశరావు తెలిపారు. అయితే ఆ స్థలాన్ని చింతపల్లి దుర్గారావు అనే వ్యక్తి ఆక్రమించి అందులో బాటిల్స్ కంపెనీ పెట్టి వ్యాపారం చేసుకుంటున్నాడని తెలిపారు. అధికారులు స్పందించి ఆ స్థలాన్ని రక్షించాలని కోరారు.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.A.631/2022 in O.S.459/2022

Between:
Sri Ala Sankar Rao ...Petitioner/Plaintiff
And:
Sri Kakara Rambabu ...Respondent/Defendant

NOTICE

To,
Respondent:
Sri Kakara Rambabu,
S/o. Late K. Veera Swamy,
Hindu, aged 39 years,
R/at : D.No.2-87A,
S.C.Colony, Thummikapalli,
Kottavalasa,Vizianagaram District.

Whereas the above named petitioner is filed the above I.A. for interim injunction restraining the respondent, his men and agents from alienating/transferring the plaint schedule property to anybody against you the same stands posted **28-07-2023** for notice to you. You are hereby called upon to appear on **28-07-2023** at **10:30 A.M.,** before the above Court either in person or by a Pleader to answer the above suit or else the matter will be disposed off in your absence according to law.

(By Order of the Hon'ble Court)
K. PRABHAVATHI,
Advocate
G-6, A-Block,
Ramalakshmi Estates,
Visakhapatnam-17.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S. 459/2022

Between:
Sri Ala Sankar Rao ...Plaintiff
And:
Sri Kakara Rambabu ...Defendant

SUIT SUMMON

To,
Defendant:
Sri Kakara Rambabu,
S/o. Late K. Veera Swamy,
Hindu, aged 39 years,
R/at : D.No.2-87A,
S.C.Colony, Thummikapalli,
Kottavalasa,
Vizianagaram District.

Whereas the above named plaintiff is filed the above suit for specific performance of Sale Agreement dated 27-09-2017 against you the same stands posted **28-07-2023** for notice to you. You are hereby called upon to appear on **28-07-2023** at **10:30 A.M.,** before the above Court either in person or by a Pleader to answer the above suit or else the matter will be disposed off in your absence according to law.

(By Order of the Hon'ble Court)
K. PRABHAVATHI,
Advocate
G-6, A-Block,
Ramalakshmi Estates,
Visakhapatnam-17.